త్రినేత్ర
సత్యం ధర్మం జ్ఞానం
Hyderabad
07 April, 2026
7:00 PM Edition
www.trinethra.news
360° Digital News



## రేవంత్‌ది రాక్షస పాలన

- రైతుల కోసం వెళ్తుంటే అరెస్టులా
- భూములు లాక్కుంటే ఊరుకోం
- భూ సేకరణ నోటిఫికేషన్ రద్దయ్యే వరకు పోరు ఆగదు
- రేవంత్‌ను మించిన రావణాసురుడు లేడు
- ఇది గడీల, బేడీల పాలన
- శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్‌రావు ఫైర్

2



## రాఘవ్ X ఆమ్ ఆద్మీ

- సామాన్యుడి గొంతుక - రాఘవ్ చద్దా

సామాన్యుడి కోసం కొట్లాడి సొంత పార్టీకే దూరమయ్యారా? ఆప్‌లో రాఘవ్ చద్దాకు ఎదురవుతున్న వ్యతిరేకత వెనుక అసలు కథ ఏమిటి? సామాన్యుడి గళం వినిపించిన రాఘవ్ చద్దాను ఆప్ ఎందుకు సైలెంట్ చేస్తున్నది?

3



# బెంగాల్ మమతదే
# తమిళనాడు స్టాలిన్‌దే

### దక్షిణాదిలో బీజేపీకి చుక్కెదురు

### ఎస్‌ఏఎస్ గ్రూప్ నిర్వహించిన ప్రీ పోల్ సర్వేలో వెల్లడి

**తమిళనాడులో 135 - 147 సీట్లు సాధించనున్న డీఎంకే కూటమి**

**పశ్చిమ బెంగాల్‌లో 171-188 సీట్లతో పట్టు నిలుపుకున్న తృణమూల్ కూటమి**

**అసోంలో 80-86 సీట్లు బీజేపీవే.. 77 సీట్లతో కేరళంలో పాగా వేయనున్న యూడీఎఫ్**

దక్షిణాదిలో పాగా వేయాలని చూస్తున్న బీజేపీకి మరికొంతకాలం వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురయ్యేలా కనిపిస్తోంది. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నాలుగు రాష్ట్రాల్లో ఎస్‌ఏఎస్ గ్రూప్ నిర్వహించిన ప్రీ పోల్ సర్వేలో ఈ విషయం వెల్లడైంది. గత నెల 28వ తేదీ నుంచి సోమవారం వరకు ఆయా రాష్ట్రాల్లో సర్వే నిర్వహించి, ఎన్నికల్లో కీలకంగా నిలిచిన అంశాలను సైతం విశ్లేషించింది. సర్వే వివరాలను ఎస్‌ఏఎస్ గ్రూప్ మంగళవారం విడుదల చేసింది. తమిళనాడు, పశ్చిమబెంగాల్, అసోంలలో అధికారంలో ఉన్న పార్టీలు తమ పట్టును నిలుపుకోగా, కేరళంలో మాత్రం అధికార ఎల్‌డీఎఫ్ కూటమికి ఎదురుగాలి వీస్తోంది.

త్రినేత్ర.న్యూస్:

తమిళనాట మొత్తం 234 స్థానాలకు ఎంకే స్టాలిన్ నేతృత్వంలోని అధికార డీఎంకే కూటమి 41 శాతం ఓట్లతో 135–147 సీట్లు సాధించనుంది. ప్రతిపక్ష ఏఐఏడీఎంకే కూటమి 37 శాతం ఓట్లతో 92–111 సీట్లు పొందనుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన సినీ హీరో విజయ్ నేతృత్వంలోని

తరువాయి 2లో



## ఆ 3 రోజులు అంటరానివాళ్లుగా చూడొద్దు

- ఆలయాల్లో మహిళల ప్రవేశాలపై సుప్రీం కోర్టు వ్యాఖ్య
- శబరిమలపై 2018 తీర్పుపై పునర్విచారణ చేపట్టిన 9 మంది జస్టిస్ ల ధర్మాసనం

త్రినేత్ర.న్యూస్:

రుతుస్రావమనే కారణంతో మహిళలను ఆ మూడు రోజులు అంటరానివారిగా చూడడం అస్సలు తగదని సుప్రీం కోర్టు న్యాయమూర్తి బీవీ నాగరత్న వ్యాఖ్యానించారు. దేశవ్యాప్తంగా ఆలయాలు, ఇతర ఆధ్యాత్మిక మందిరాల్లో మహిళల ప్రవేశంపై 2018లో వెలువడిన తీర్పుపై 9 మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం తిరిగి విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళలందరినీ అనుమతిస్తూ 2018లో తీర్పు వెలువడింది. ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనంలో.. అనుకూలంగా నలుగురు వ్యతిరేకంగా ఒకరు తీర్పు చెప్పారు. అయితే అయ్యప్ప స్వామికి ఉన్న ప్రత్యేకత దృష్ట్యా వయసుతో నిమిత్తం లేకుండా మహిళలందరినీ శబరిమల మందిరంలోకి అనుమతించడం భావ్యం కాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తమ వాదన వినిపించారు. మహిళల ప్రవేశాన్ని నిరోధించడం అంటరానితనం కిందికి వస్తుందంటూ కారణంగా చూపి 2018లో వచ్చిన తీర్పుపై తిరిగి సమీక్ష చేయాలని ఆయన ధర్మాసనాన్ని వేడుకున్నారు. కేవలం నిర్దిష్ట వయసు గల మహిళలకు మాత్రమే ఆంక్షలు విధించి మిగతా అందరికీ దర్శనం అయ్యేలా చట్టం అమలు చేయాలని చెప్పారు.

## కేసీఆర్‌ను మార్చినట్టే విజయన్‌ను మార్చండి

- కేరళంలో సీఎం రేవంత్

పినరయి విజయన్ నాకు రాసిన లేఖలోని తప్పులన్నీ జరగడంతోనే తెలంగాణలో కేసీఆర్‌ను మార్చివేశారని... ఇప్పుడు విజయన్‌ను కూడా కేరళం ప్రజలు మారుస్తారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేరళంలోని కోవలం నియోజకవర్గంలో మంగళవారం ఉదయం రేవంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.



2

## రేవంత్ భాష మార్చుకో..

- ఆటిట్యూట్ తగ్గించుకో
- వ్యక్తిగత దూషణలొద్దు
- సీఎం రేవంత్ రెడ్డికి పినరయి విజయన్ స్ట్రాంగ్ కౌంటర్

కేరళలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వంపై, అక్కడి అభివృద్ధిపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు కేరళ సీఎం పినరయి విజయన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు రేవంత్ రెడ్డికి ఆయన ఒక సుదీర్ఘమైన, ఘాటైన లేఖను రాశారు. రాజకీయంగా విభేదాలు ఉండటం సహజమేనని, కానీ వ్యక్తిగత దూషణలతో విమర్శలు చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని విజయన్ స్పష్టం చేశారు. కేరళ ప్రజల అనుభవం, మీరు చెబుతున్న దానికి పూర్తి భిన్నంగా ఉందని లేఖలో పేర్కొన్నారు.



2



## పొంగులేటి.. దమ్ముంటే డాక్యుమెంట్లతో రా..

- **ఆర్ఎస్పీ సవాల్**

**త్రినేత్ర.న్యూస్:**
కాంగ్రెస్ ముమ్మాటికీ భూ ఆక్రమణల ప్రభుత్వమేనని, సీఎం రేవంత్ రెడ్డి, పొంగులేటి కలిసి లక్షల కోట్ల భూ దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. పొంగులేటికి దమ్ముంటే డాక్యుమెంట్లతో రావాలని.. ఎక్కడైనా సరే చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్ లో మీడియాతో మాట్లాడారు. భూ దోపిడీని అడ్డుకునేందుకు పరిగి వెళ్తున్న హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సీఎం హోంమంత్రి శాఖను తన చంకలో పెట్టుకోవడం, పొంగులేటి దగ్గర రెవెన్యూ, సమాచార శాఖలు పెట్టుకొని కోట్ల రూపాయలు దండుకుంటున్నారని ధ్వజమెత్తారు. నాదర్ గుల్ భూములపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు ఏక్యూ స్క్వేర్ మనుషులు నీళ్ల నమిలారని ఎద్దేవా చేశారు. నిన్న ఆదిలాబాద్ లో ప్రజాస్వామ్యం గురించి గొప్పగా చెప్పిన సీఎం రేవంత్ 24 గంటల్లోనే దాన్ని ఉల్లంఘించారన్నారు. సీఎం, పొంగులేటి న్యాయంగా సంపాదించుకుంటే అభ్యంతరం లేదన్నారు.

## బెంగాల్ మమతదే

**మొదటిపేజీ తరువాయి..**
టీవీకే పార్టీ 16 శాతం ఓట్లతో 6–10 సీట్లకు పరిమితం కానుంది.

పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు గాను అధికార తృణమూల్ కాంగ్రెస్ కూటమి 46.5 శాతం ఓట్లతో 171–188 స్థానాలను సాధించనుంది. దీంతో మమతా బెనర్జీ బెంగాల్‌పై తన పట్టును మరోమారు చాటుకున్నారు. ప్రతిపక్ష బీజేపీ కూటమి 41.5 శాతం ఓట్లతో 118–126 సీట్లతో అధికార పీఠానికి దూరంగానే నిలిచిపోయింది. కాంగ్రెస్ పార్టీ 3.75 శాతం ఓట్లతో 2–6 సీట్లు, సీపీఎం మూడు శాతం ఓట్లతో 1–3 సీట్లు సాధించి తామున్నామని ప్రజలకు గుర్తు చేస్తున్నాయి.

కేరళంలో కేవలం రెండు శాతం ఓట్ల తేడాతో ఎల్‌డీఎఫ్ కూటమి తన అధికారాన్ని కోల్పోనుంది. మొత్తం 140 అసెంబ్లీ స్థానాలకు గాను ప్రతిపక్ష యూడీఎఫ్ కూటమి 41.5 శాతం ఓట్లతో 77 సీట్లను సాధించనుండగా, అధికార ఎల్‌డీఎఫ్ కూటమి 39.5 శాతం ఓట్లతో 58 సీట్లకే పరిమితం కానుంది. బీజేపీ 15 శాతం ఓట్లతో కేరళం అసెంబ్లీలో తొలిసారిగా నాలుగు స్థానాలు సాధించనుంది.

ఈశాన్య రాష్ట్రమైన అసోంలో 126 అసెంబ్లీ స్థానాలకుగాను అధికార ఎన్డీఏ కూటమి 46.5 శాతం ఓట్లతో 80–86 సీట్లు సాధించనుంది. 43 శాతం ఓట్లతో ప్రతిపక్ష కాంగ్రెస్ కూటమి 40–46 సీట్లకు పరిమితం కానుంది.

మ్యాట్రిజ్ సర్వే సంస్థ ప్రకారం పశ్చిమ బెంగాల్, అసోంలలో అధికార టీఎంసీ, బీజేపీ తమ పీఠాన్ని నిలుపుకోగా, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో హోరాహోరీ ఉండగా, ప్రతిపక్ష ఎన్‌డీఏ, యూడీఎఫ్ కూటముల వైపే స్వల్ప మొగ్గు కనిపిస్తోంది.

# కేసీఆర్‌ను మార్చినట్టే విజయన్‌ను మార్చండి

- **కేరళంలో సీఎం రేవంత్**

**త్రినేత్ర.న్యూస్:**
పినరయి విజయన్ నాకు రాసిన లేఖలోని తప్పులన్నీ జరగడంతోనే తెలంగాణలో కేసీఆర్‌ను మార్చివేశారని... ఇప్పుడు విజయన్‌ను కూడా కేరళం ప్రజలు మారుస్తారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేరళంలోని కోవలం నియోజకవర్గంలో మంగళవారం ఉదయం రేవంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేరళం ఓటర్లను ఉద్దేశించి ప్రసంగించారు. మోదీ, విజయన్ బంధాన్ని ఇక్కడి ప్రజలు అర్థం చేసుకున్నారని.. ఇక సరైన నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మార్పు తథ్యం అని పేర్కొన్నారు.



**విజయన్ గాడ్ ఫాదర్ ఢిల్లీలో ఉన్నారు..**
విజయన్‌పై శబరిమల బంగారం చోరీ, బంగారం స్మగ్లింగ్ కేసులున్నాయి. ఆయన గాడ్ ఫాదర్ నరేంద్ర మోదీ ఢిల్లీలో ఉన్నారు. మోదీనే ఈ కేసులన్నింటి నుంచి విజయన్‌ను రక్షిస్తున్నారు. దేశం కోసం తమ జీవితాలను, ఆస్తులను త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని మాత్రం రకరకాల కేసులతో వేధిస్తున్నారు. కేజ్రీవాల్ సహా అనేక మంది నేతలను ఈడీ కేసులతో వేధించారు. అరెస్టులు చేశారు. కానీ విజయన్ జోలికి ఎందుకు రావడం లేదో ఒక్కసారి ఆలోచించాలి. మోదీ, విజయన్ మధ్య ఉన్న అవగాహనతోనే కేసులు, అరెస్టులు లేవు అని రేవంత్ పేర్కొన్నారు.

**మంచి జరిగితే అభినందిస్తం..**
కేరళంలో పంచాయతీరాజ్ వ్యవస్థ ఘనత కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీలది. ఎక్కడైనా మంచి జరిగితే మేం అభినందిస్తాం. పంచాయతీ రాజ్ వ్యవస్థ విజయం సాధించింది. దాన్ని మేం అభినందిస్తున్నాం. పినరయి విజయన్ హయాంలోని వైఫల్యాలను ఎత్తి చూపాను. 120 నెలల విజయన్ పాలన వైఫల్యానికి ప్రతీకగా నిలిచింది. ఆయన వైదొలిగే సమయం ఆసన్నమైంది.

**విజయన్ సమాధానం ఇవ్వాలి..**
విజయన్‌తో పాటు కేరళం కమ్యూనిస్టు మహిళా నాయకులను తెలంగాణకు ఆహ్వానిస్తున్నా. వారికి అవసరమైన అన్ని ఏర్పాట్లు మేం చేస్తాం. తెలంగాణలో ఏ మూలకైనా వెళ్లి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించవచ్చు. ఈ విషయంలో నేను విజయన్‌కు సవాల్ చేస్తున్నా. మేం 67 వేల ఉద్యోగాలిచ్చాం. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ. 20,670 కోట్ల రుణమాఫీ చేశాం. 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నం. రూ.500 కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తున్నం. ఎన్నికలు కేరళం, తెలంగాణ మధ్య కాదు.. యూడీఎఫ్, ఎల్డీఎఫ్ మధ్య జరుగుతున్నాయి. మేం ఏం చేస్తున్నామో అది చెబుతున్నాం.. మా సవాళ్లకు విజయన్ సమాధానం ఇవ్వాలి అని రేవంత్ అన్నారు.

తెలంగాణలో 2014–23 మధ్య జరిగిన విషయాలపై విజయన్ నాకు ఓ లేఖ రాశారని గుర్తు చేశారు. అప్పుడు పినరయి సన్నిహిత మిత్రుడు కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నారన్నారు. ఆయన లేఖలోని తప్పులన్నీ జరిగినందునే తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను మార్చివేశారని తెలిపారు. ఇప్పుడు విజయన్‌ను కూడా కేరళం ప్రజలు మార్చివేస్తారని జోస్యం చెప్పారు.

- **ఇక్కడ వృద్ధులు, చిన్న పిల్లలే కనిపిస్తున్నరు..**

మూడింట రెండొంతుల మెజారిటీతో మేం గెలవబోతున్నాం. ఊమెన్‌చాందీ తరహా పాలన అందిస్తాం. యువత వలస వెళ్లడంతో వృద్ధులు, చిన్నపిల్లలే కనిపిస్తున్నారు. ఇది దురదృష్టకరం. విద్యావంతులు, నైపుణ్యం ఉన్న యువత విదేశాలకు వెళ్లడం మంచిది కాదు. వాళ్లు ఇక్కడకు వచ్చి ఉపాధి పొందేలా చేస్తాం. తెలంగాణలో మాదిరే అభివృద్ధి.. మౌలిక వసతుల కల్పన, ఉద్యోగ నియామకాలు, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాం.

# రేవంత్‌ది రాక్షస పాలన

- **రైతుల కోసం వెళ్తుంటే అరెస్టులా**
- **భూములు లాక్కుంటే ఊరుకోం**
- **భూ సేకరణ నోటిఫికేషన్ రద్దయ్యే వరకు పోరు ఆగదు**
- **రేవంత్‌ను మించిన రావణాసురుడు లేడు**
- **ఇది గడీల, బేడీల పాలన**
- **శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్‌రావు ఫైర్**

**త్రినేత్ర.న్యూస్:**
రేవంత్ పాలన అంటేనే రాక్షస పాలన అని, కాంగ్రెస్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని హరీశ్‌రావు విమర్శించారు. ఇది గడీల పాలన.. బేడీల పాలన, దొంగల పాలన అని ధ్వజమెత్తారు. పరిగి రైతులకు భరోసా ఇచ్చేందుకు వెళ్తుండగా ఆయన అరెస్టు చేసి శంషాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించగా అక్కడే మీడియాతో మాట్లాడారు. రైతుల భూముల లాక్కునే నోటిఫికేషన్ రద్దు చేసే దాకా పోరాటం ఆగదని హెచ్చరించారు. నాడు ప్రజాస్వామ్యం ఏడో గ్యారెంటీ అని చెప్పిన సీఎం.. నేడు ప్రతిపక్షాల మీద ఎదురు దాడి చేస్తున్నారని మండిపడ్డారు.




**రేవంత్‌ను మించిన రావణాసురుడు లేడు..**
రైతులను కలిసేందుకు వెళ్తుంటే అరెస్టులు చేయడం దౌర్జన్యమన్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని ఆరోపించారు. రెండు మూడు పంటలు పండే భూముల్లో పరిశ్రమలు పెట్టడం దారుణమన్నారు. రేవంత్‌ను మించిన రావణాసురుడు ఇంకెవరు ఉండరన్నారు. పేదల ఇళ్లు కూల్చుతూ వికృతానందం పొందుతున్నారని ఆరోపించారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తా అని మోసం చేశాడని ఫైరయ్యారు. విద్యార్థులను, మహిళలను, పోలీసులను ఎవర్ని అడిగినా వారు రేవంత్ రెడ్డే రాక్షసుడు అంటున్నారని చెప్పారు.

**హరీశ్‌రావు అరెస్టు..**
అంతకుముందు పరిగి బయలుదేరిన హరీశ్‌రావును పోలీసులు అడుగడుగునా అడ్డుకున్నారు. మొదట గృహ నిర్బంధం చేయగా అనంతరం అప్పా జంక్షన్ వద్ద అడ్డగించి అరెస్టు చేశారు. అనంతరం శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నాయకులు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. హరీశ్ రావు వెంట మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

- **24 గంటల్లోనే సీఎం మాట తప్పిండు..**

పరిగి మండలం రాపోలు శివారులో ప్రభుత్వం భూ సేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. రాపోలులో 610 ఎకరాలు, కాడ్లాపూర్‌లో 587 ఎకరాలు ఉన్నాయని చెప్పారు. వీటిలో 260 ఎకరాలు పట్టా భూములు కాగా 937 ఎకరాల లావణి పట్టా భూములని తెలిపారు. వీటిని కొల్లగొడుతున్న కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని, ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు. రేవంత్ మళ్లా గెలవం ఒక పగటి కల అని, వచ్చేది కేసీఆర్ రాజ్యమేనని పేర్కొన్నారు. రేవంత్ మాటలకు, చేతలకు పొంతన లేదని ఆగ్రహించారు.

## ప్రభుత్వం రైతులను అరిగోస పెడుతోంది

- **కేటీఆర్**

ఇండస్ట్రియల్ బాధిత రైతులను కలిసేందుకు పరిగి వెళ్లకుండా బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులు, నిర్బంధాలపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకునేందుకు పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న నేతలను అక్రమంగా నిర్బంధించడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్యగా అభివర్ణించారు.

ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాడ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1,200 ఎకరాల భూమిని బలంతంగా లాక్కున్నారని కేటీఆర్ ఆరోపించారు.



అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ సర్కార్ ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపైన పడిందని మండిపడ్డారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం.. ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు.

## రేవంత్ భాష మార్చుకో..

**నీతి ఆయోగ్ ర్యాంకుల్లో మీరేక్కడ.. మేమెక్కడ?**
అభివృద్ధి, అవినీతి విషయాల్లో రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు విజయన్ నీతి ఆయోగ్ గణాంకాలతో బదులిచ్చారు.
అవినీతి: నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం భారతదేశంలో అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ అని, కానీ తెలంగాణ దేశంలోనే అత్యంత అవినీతి రాష్ట్రాల్లో 6వ స్థానంలో ఉందని విజయన్ చురకలంటించారు.
సస్టైయినబుల్ డెవలప్‌మెంట్: సుస్థిర అభివృద్ధి సూచీలో కేరళ 79 పాయింట్లతో మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ 6వ స్థానంలో ఉందని గుర్తుచేశారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సంస్కరణల్లోనూ కేరళ మొదటి ర్యాంకు సాధించిందన్నారు.

**కాంగ్రెస్ ఘనత కాదు.. వామపక్షాల కృషే**
కేరళ సాధించిన సామాజిక అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ చేసిన కృషేనంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను విజయన్ కొట్టిపారేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దంలోనే జమీందారీ వ్యవస్థను రద్దు చేసేందుకు కేరళలోని తొలి కమ్యూనిస్ట్ ప్రభుత్వం 'అగ్రేరియన్ రిలేషన్స్ బిల్లు'ను తీసుకువచ్చిందని, అయితే అప్పటి కాంగ్రెస్ కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి ఆ ప్రభుత్వాన్ని అప్రజాస్వామికంగా రద్దు చేసిందని చరిత్రను గుర్తుచేశారు. 1980లలో అక్షరాస్యత ఉద్యమం, 1996లో అధికార వికేంద్రీకరణ వామపక్ష ప్రభుత్వాల ఘనతేనని స్పష్టం చేశారు.

# రాఘవ్ X ఆమ్ ఆద్మీ

## సామాన్యుడి గొంతుక - రాఘవ్ చద్దా

**ఎయిర్‌పోర్టులో సమోసా ధరల నుంచి 28-రోజుల సిమ్ రీఛార్జ్ వరకు సామాన్యుడి కోసం కొట్లాడి సొంత పార్టీకే దూరమయ్యారా? ఆప్‌లో రాఘవ్ చద్దాకు ఎదురవుతున్న వ్యతిరేకత వెనుక అసలు కథ ఏమిటి? సామాన్యుడి గళం వినిపించిన రాఘవ్ చద్దాను ఆప్ ఎందుకు సైలెంట్ చేస్తున్నది?**



వార్తల్లో వ్యక్తి

**చార్టర్డ్ అకౌంటెంట్ (CA) చదివి, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లో విద్యనభ్యసించిన చద్దా.. కార్పొరేట్ రంగంలో ఉన్నత స్థానంలో ఉంటూ 2011 అవినీతి వ్యతిరేక ఉద్యమం ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన వ్యక్తిగత జీవితం కూడా ఎప్పుడూ వార్తల్లోనే ఉంటుంది. బాలీవుడ్ నటి పరిణీతి చోప్రాను ప్రేమించిన ఆయన.. సెప్టెంబర్ 2023లో ఉదయపూర్‌లో అంగరంగ వైభవంగా పెళ్లి చేసుకున్నారు. అక్టోబర్ 19, 2025న ఈ జంటకు 'నీర్' అనే బాబు జన్మించాడు.**

## సామాన్యుడి గొంతుకగా రాఘవ్ పోరాటాలు

**చద్దా రాజకీయ వివాదాల్లో ఉన్నప్పటికీ, ఆయన రాజ్యసభలో లేవనెత్తిన అంశాలు సామాన్యులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. సామాన్యుల పక్షాన నిలబడి రాఘవ్ చద్దా రాజ్యసభలో అనేక కీలక అంశాలను గళమెత్తారు.**

### 1 ఎయిర్‌పోర్టుల్లో సామాన్యులకు అందుబాటు ధరలో ఆహారం

**రాఘవ్ చద్దా డిమాండ్:** విమానాశ్రయాల్లో ఒక సాధారణ టీ లేదా కాఫీ ధర రూ.200 నుంచి రూ.400 వరకు ఉండటం సామాన్యులకు అత్యంత భారం. ప్రయాణికులు సెక్యూరిటీ చెక్ పూర్తయిన తర్వాతే ఎక్కువ సమయం గడుపుతారు కాబట్టి, ఆ ఏరియాలో కచ్చితంగా అందుబాటు ధరల్లో ఫుడ్ కౌంటర్లు ఉండాలి.

**ప్రభుత్వ స్పందన:** పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఈ సమస్యను అంగీకరించింది. ప్రయాణికులకు అందుబాటు ధరల్లో (ఉదాహరణకు టీ రూ.10-రూ.20) ఆహారం అందించేందుకు "ఉడాన్ యాత్రి కేఫ్" అనే కార్యక్రమాన్ని ప్రారంభించింది.

**అమలు పరిస్థితి (పాక్షికం):** 150 పైగా విమానాశ్రయాలు ఉంటే కేవలం 10-12 చోట్ల మాత్రమే ఇవి ప్రారంభమయ్యాయి. పైగా, వాటిలో చాలా వరకు సెక్యూరిటీ చెకింగ్ ఏరియాకు బయట ఉండటం వల్ల, లోపల వేచి ఉండే ప్రయాణికులకు ఇవి అందుబాటులో లేవు.

### 2 28 రోజుల' మొబైల్ రీఛార్జ్ స్కామ్

**రాఘవ్ చద్దా డిమాండ్:** టెలికాం కంపెనీలు 'నెలవారీ' ప్లాన్‌ల పేరుతో 30 లేదా 31 రోజులకు బదులుగా కేవలం 28 రోజుల వాలిడిటీని మాత్రమే ఎందుకు ఇస్తున్నాయి? దీని వల్ల వినియోగదారులు ఏడాదిలో 13 సార్లు (28 రోజులు x 13 = 364 రోజులు) రీఛార్జ్ చేయాల్సి వస్తోంది. నెలవారీ ప్లాన్ అంటే కచ్చితంగా క్యాలెండర్ నెల మొత్తం ఉండాలి.

**ప్రభుత్వ స్పందన:** ప్రతి టెలికాం ఆపరేటర్ కచ్చితంగా కనీసం ఒక 30 రోజుల వాలిడిటీ ప్లాన్‌ను, అలాగే ప్రతి నెలా ఒకే తేదీన రెన్యూవల్ చేసుకునే విధంగా ఒక కాంబో వోచర్‌ను కస్టమర్లకు అందించాలని టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది.

**అమలు పరిస్థితి (పరిమితం):** నిబంధనల అమలు కోసం జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్-ఐడియా ఒక ప్రత్యేకమైన 30-రోజుల ప్లాన్‌ను ప్రవేశపెట్టాయి. కానీ అత్యధిక మంది కొనుగోలు చేసే పాపులర్ రెగ్యులర్ ప్లాన్లు అన్నీ ఇప్పటికీ 28 రోజుల వాలిడిటీతోనే కొనసాగుతున్నాయి.

### 3 'మినిమం బ్యాలెన్స్' జరిమానాలు

**రాఘవ్ చద్దా డిమాండ్:** కనీస బ్యాలెన్స్ మెయింటైన్ చేయలేదన్న నెపంతో మూడేళ్ల వ్యవధిలో బ్యాంకులు కస్టమర్ల నుంచి రూ.19,000 కోట్లకు పైగా జరిమానాలు వసూలు చేశాయి. ఇది "పేదరికంపై వేస్తున్న ఫైన్". ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారిపై ఈ తరహా పెనాల్టీలు విధించడాన్ని వెంటనే రద్దు చేయాలి.

**ప్రభుత్వ స్పందన:** ఖాతాల నిర్వహణకు బ్యాంకులకు కొంత ఖర్చు అవుతుందని ఆర్థిక శాఖ సమర్థించుకుంది. కనీస బ్యాలెన్స్ అవసరం లేని జీరో బ్యాలెన్స్ (బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ - జన్ ధన్) ఖాతాలు తెరుచుకునే అవకాశం కస్టమర్లకు ఉందని తెలిపింది.

**అమలు పరిస్థితి (అమలు కాలేదు):** ఈ డిమాండ్ అమలు కాలేదు. రెగ్యులర్ సేవింగ్స్ అకౌంట్లలో కనీస బ్యాలెన్స్ లేకపోతే బ్యాంకులు ఇప్పటికీ కస్టమర్ల ఖాతాల నుంచి ఫైన్లు కట్ చేస్తూనే ఉన్నాయి.

### 4 గిగ్ వర్కర్ల భద్రత (10-నిమిషాల డెలివరీ యాప్స్)

**రాఘవ్ చద్దా డిమాండ్:** జెప్టో, బ్లింకిట్ లాంటి '10 నిమిషాల డెలివరీ' యాప్స్ పెరిగిపోతున్నాయి. ఆ డెలివరీ బాయ్స్‌ను "హెల్మెట్లు ధరించిన బందీలు"గా ఆయన అభివర్ణించారు. 10 నిమిషాల్లో డెలివరీ చేయాలనే యాజమాన్యాల ఒత్తిడి వల్ల రైడర్లు, పాదచారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. డెలివరీ సమయాలను నియంత్రించి, ఆ వర్కర్లకు సామాజిక భద్రత కల్పించాలి.

**ప్రభుత్వ స్పందన:** గిగ్ వర్కర్ల కోసం సామాజిక భద్రతా పథకాలను కల్పించే 'కోడ్ ఆన్ సోషల్ సెక్యూరిటీ, 2020'ని ప్రభుత్వం ప్రస్తావించింది. అయితే, 10 నిమిషాల డెలివరీ మోడల్‌పై ప్రత్యక్షంగా ఎలాంటి నియంత్రణలు లేదా నిషేధం విధించలేదు.

**అమలు పరిస్థితి (పెండింగ్):** చట్టం ఆమోదించబడినప్పటికీ దేశవ్యాప్తంగా ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదు. ప్రమాదకరమైన డెలివరీ సమయాలపై నియంత్రణ లేదు.

### 5 హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ

**రాఘవ్ చద్దా డిమాండ్:** జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై ప్రభుత్వం 18% జీఎస్టీ విధించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. దీన్ని "ప్రాణాలపై పన్ను" గా అభివర్ణించారు. సామాన్యులకు వైద్యం అందుబాటులో ఉండాలంటే ఇన్సూరెన్స్‌పై ఈ జీఎస్టీని రద్దు చేయాలి.

**ప్రభుత్వ స్పందన:** జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లో ఈ విషయం చర్చకు వచ్చింది. కానీ పన్ను మినహాయింపు లేదా తగ్గింపుపై ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

**అమలు పరిస్థితి (అమలు కాలేదు):** ఈ డిమాండ్ అమలు కాలేదు. హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై 18% జీఎస్టీ భారం అలాగే కొనసాగుతోంది.

### 6 విమానాల ఆలస్యానికి నష్టపరిహారం

**రాఘవ్ చద్దా డిమాండ్:** ప్రయాణికులు ఎప్పుడైనా టికెట్ క్యాన్సిల్ చేసుకుంటే ఎయిర్‌లైన్స్ భారీగా క్యాన్సిలేషన్ ఫీజు వసూలు చేస్తాయి. అదే విమానాలు గంటల కొద్దీ ఆలస్యమైనప్పుడు ప్రయాణికులకు కూడా ఆ సంస్థలు ఆర్థికంగా పరిహారం చెల్లించాలి లేదా పూర్తి రీఫండ్ ఇవ్వాలి.

**ప్రభుత్వ స్పందన:** విమానం 24 గంటల కంటే ఎక్కువ ఆలస్యమైనా, లేదా బోర్డింగ్ నిరాకరించినా మాత్రమే పరిహారం చెల్లించే అవకాశం ఉంది. తక్కువ సమయం ఆలస్యమైతే ప్రయాణికులకు కేవలం స్నాక్స్/ఆహారం ఇస్తే సరిపోతుంది.

**అమలు పరిస్థితి :** క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉంది. 2 నుంచి 6 గంటల సాధారణ ఆలస్యాలకు సంస్థలు ఆటోమేటిక్‌గా పరిహారం ఇవ్వడం లేదు. కారణాలు చెబుతూ పరిహారం చెల్లించడం లేదు.

త్రినేత్ర.న్యూస్

ఒకప్పుడు ఆమ్ ఆద్మీ పార్టీ అనగానే అరవింద్ కేజ్రీవాల్ తర్వాత అంతటి చరిష్మా ఉన్న యువ నేతగా రాఘవ్ చద్దా కనిపించేవారు. అతి చిన్న వయసులోనే రాజ్యసభ ఎంపీగా అడుగుపెట్టి, సామాన్యుల సమస్యలపై అనర్గళంగా మాట్లాడిన ఈ 'గోల్డెన్ బాయ్'.. ఇప్పుడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఏప్రిల్ 2026 నాటికి ఆయన రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. ఆప్ అధిష్టానంతో తీవ్ర విభేదాలు, పదవీచ్యుతి, సోషల్ మీడియాలో ఆయన పెడుతున్న క్రిప్టిక్ (గూఢమైన) పోస్టులు జాతీయ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

**సొంత పార్టీలోనే 'సైలెంట్'**

ఏప్రిల్ 2, 2026న ఆప్ అధిష్టానం సంచలన నిర్ణయం తీసుకుంది. రాజ్యసభ డిప్యూటీ లీడర్ పదవి నుంచి రాఘవ్ చద్దాను తప్పించి, ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. అంతకంటే ఆశ్చర్యకరమైన విషయం



ఏమిటంటే.. రాజ్యసభలో పార్టీ కోటాలో చద్దాకు మాట్లాడే అవకాశం ఇవ్వొద్దని ఆప్ సెక్రటేరియట్‌కు లేఖ రాసింది.

- **బీజేపీలోకి వెళ్తారా?**

చద్దా బీజేపీకి దగ్గరవుతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ సంచలన ఆరోపణలు చేస్తూ.. చద్దా తన సోషల్ మీడియా ఖాతాల నుంచి ప్రధాని మోదీ, బీజేపీలను విమర్శిస్తూ గతంలో పెట్టిన పోస్టులన్నింటినీ డిలీట్ చేశారని పేర్కొన్నారు. దానికి తగ్గట్టుగానే చద్దా తన సోషల్ మీడియా బయో నుంచి "AAP" పేరును తొలగించి, కేవలం "రాజ్యసభ ఎంపీ" అని మాత్రమే ఉంచడం ఈ పుకార్లకు బలం చేకూరుస్తోంది.

**ఆప్ నేతల ఆరోపణలు.. చద్దా కౌంటర్లు**

పంజాబ్ సీఎం భగవంత్ మాన్, అతిషి వంటి సీనియర్ నేతలు చద్దాపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. కేంద్రంపై పోరాడాల్సిన సమయంలో ఆయన "సాఫ్ట్ పాలిటిక్స్" చేస్తున్నారని, జీఎస్టీ నిధుల సాధన వంటి కీలక పోరాటాలను వదిలేసి "ఎయిర్‌పోర్టులో సమోసాల ధరల" గురించి మాట్లాడుతున్నారని మాన్ ఎద్దేవా చేశారు. ముఖ్యమైన నిరసనల సమయంలో ఆయన పార్టీ లైన్ దాటారని ఆరోపించారు.

అయితే, ఇదంతా తన ఇమేజ్‌ను దెబ్బతీసేందుకు ఉద్దేశపూర్వకంగా ఆడుతున్న నాటకమని చద్దా కొట్టిపారేశారు.



## 5 కిలోల గ్యాస్ సిలిండర్ సరఫరా రెట్టింపు

**త్రినేత్ర.న్యూస్:**

5 కిలోల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరాను రోజువారీ కోటాలో పెంచాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ అన్ని రాష్ట్రాలకు లేఖ రాశారు. వలస కార్మికుల గ్యాస్ కష్టాలు తీర్చేందుకు 'ఛోటూ' అనే 5 కేజీల సిలిండర్‌ను కేంద్రం ప్రారంభించింది. ఏదైనా ఒక గుర్తింపు కార్డు చూపించి ఈ 5 కిలోల సిలిండర్‌ను సులభంగా కొనుగోలు చేయవచ్చు. ఇందులో బైబ్యాక్ సదుపాయాలు కూడా ఉన్నాయి. కేంద్ర సర్కారు వలసకార్మికుల సౌలభ్యం కోసం 5 కేజీల సిలిండర్‌ల సరఫరాను రెట్టింపు చేసింది.



## నాసా సరికొత్త చరిత్ర..

- **అపోలో-13 రికార్డు బద్దలు..**

**త్రినేత్ర.న్యూస్:**

అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) సరికొత్త రికార్డును సృష్టించింది. నాసా ఆర్టెమిస్–2 మిషన్‌తో మానవులు ఇప్పటి వరకు భూమి నుంచి ప్రయాణించిన దూరాన్ని అధిగమించి ప్రయాణించారు. ఈ క్రమంలో 1970లో చేపట్టిన అపోలో 13 మిషన్ సెట్ చేసిన రికార్డును సైతం బద్దలు కొట్టింది. నాసా తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుడికి చేరువవుతున్న సమయంలో వ్యోమగాములకు స్పేస్‌షిప్ విండోస్ నుంచి చంద్రుడు కనువిందు చేశాడు. ఇప్పటి వరకు మనుషులెవరూ ఇంత సమీపంగా చూడని చంద్రుడి ఆవలి భాగాన్ని వీక్షించే అవకాశం ఈ మిషన్‌తో దక్కింది.



## ఎయిర్ ఇండియా సీఈవో రాజీనామా

**త్రినేత్ర.న్యూస్:**

దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) క్యాంప్‌బెల్ విల్సన్ తన పదవికి రాజీనామా చేశారు. గత వారం జరిగిన బోర్డు మీటింగ్‌లో సంస్థ యాజమాన్యం ఆయన రాజీనామాను ఆమోదించినట్లు ప్రముఖ న్యూస్ ఏజెన్సీ రాయిటర్స్ కథనం పేర్కొంది. అయితే మరొకరిని నియమించే వరకు ఆయన పదవిలో కొనసాగుతారని తెలిపింది. నాయకత్వ మార్పు ప్రక్రియకు కొంతకాలం పడుతుందని పేర్కొంది. అవసరమైతే ఆయన పదవీకాలాన్ని సెప్టెంబర్ వరకు పొడిగించే అవకాశం ఉంది.

# డెడ్‌లైన్ దాటితే వినాశనమే

- **ఇరాన్‌కు ట్రంప్ అల్టిమేటం**
- **నాలుగు గంటల్లో ఇరాన్ పవర్ ప్లాంట్లు, వంతెనలు నాశనం చేస్తాం**
- **ఇరాన్ ప్రజలు రైలు ప్రయాణాలు చేయొద్దన్న ఇజ్రాయెల్**
- **తీవ్రస్థాయికి చేరిన అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం**




**అమెరికా - ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరుకున్నాయి. హోర్ముజ్ జలసంధి వివాదంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు కఠిన హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ అంతటా ఇజ్రాయెల్ భీకర దాడులు జరపగా, ప్రతీకారంగా సౌదీ అరేబియాలోని చమురు క్షేత్రాలపై ఇరాన్ విరుచుకుపడింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం తలెత్తే ప్రమాదం నెలకొంది. దీని ప్రభావం భారత్, నేపాల్ వంటి దేశాలపైనా పడుతోంది.**

**హోర్ముజ్ జలసంధిపై ట్రంప్ డెడ్‌లైన్**
ప్రపంచంలో 20 శాతం చమురు రవాణా జరిగే కీలకమైన 'హోర్ముజ్ జలసంధి'ని ఇరాన్ మూసివేయడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. మంగళవారం రాత్రిలోగా జలసంధిని తెరవకపోతే, కేవలం 4 గంటల వ్యవధిలోనే ఇరాన్‌లోని పవర్ ప్లాంట్లు, వంతెనలన్నింటినీ నాశనం చేస్తామని ఆయన అల్టిమేటం జారీ చేశారు. ఈ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర స్థాయిలో మండిపడింది.

**త్రినేత్ర.న్యూస్ :**

అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న దాడులు, ప్రతిదాడులు ప్రాంతీయ భద్రతనే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సైతం ప్రమాదంలో పడేస్తున్నాయి. ఇరాన్ అంతటా పలు మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా తమ దాడులు పూర్తయ్యాయని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్ ప్రజలు రైలు ప్రయాణాలు మానుకోవాలని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరించింది. పౌర ప్రాంతాలు, విమానాశ్రయాలు (ఖోర్రమాబాద్ ఎయిర్‌పోర్ట్) సైతం దాడుల బారిన పడుతున్నాయి.

**సౌదీపై ఇరాన్ ప్రతీకార దాడులు**
ఇజ్రాయెల్ దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ రంగంలోకి దిగింది. సౌదీ అరేబియాలోని తూర్పు నగరమైన జుబైల్, జుయమాలో ఉన్న పెట్రో కెమికల్ ప్లాంట్లపై ఇరాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. అమెరికా తన దాడులను కొనసాగిస్తే, రాబోయే కొన్నేళ్ల పాటు అమెరికా, దాని మిత్రదేశాలకు చమురు, గ్యాస్ సరఫరా లేకుండా చేస్తామని ఇరాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది.కీలక వంతెన మూసివేత: దాడుల భయంతో సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లను కలిపే వ్యూహాత్మక 'కింగ్ ఫహద్ కాజ్‌వే' వంతెనను అధికారులు మూసివేశారు.పరిస్థితి ఇలాగే కొనసాగితే మధ్యప్రాచ్యం పూర్తిగా చేయిజారిపోయే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# పాకిస్థాన్‌లో స్మార్ట్ లాక్‌డౌన్

- **ఇంధన సంక్షోభమే కారణం**





మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధంతో ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సంక్షోభం నెలకొంది. ఈ సంక్షోభ ప్రభావంతో దాయాది పాకిస్థాన్‌లో లాక్‌డౌన్ విధించారు. యుద్ధం కారణంగా హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, విదేశాల నుంచి చమురు రాకపోవడంతో పాక్ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కుంటోంది. దీనిని ఎదుర్కొనేందుకు తమ దేశంలో "స్మార్ట్ లాక్‌డౌన్‌ విధిస్తున్నట్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్వయంగా ప్రకటించారు. ప్రాంతాల ఆధారంగా మార్కెట్లు, షాపింగ్ మాల్స్, వాణిజ్య కేంద్రాలను రాత్రి ఎనిమిది గంటలకే మూసివేయాలని ఆదేశించింది. కొన్ని కొన్ని ప్రాంతాల్లో మరికొంత సమయం మినహాయింపునిచ్చారు. అత్యవసర ఆరోగ్య సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా మెడికల్ స్టోర్స్, ఫార్మసీలకు మాత్రం ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. పెళ్లి వేడుకలపై కూడా ఆంక్షలు విధించారు. వివాహ వేదికలు రాత్రి 10 గంటలకల్లా మూసివేయాలి. 10 తర్వాత ఇళ్లల్లో మాత్రమే పెళ్లి వేడుకలు జరుపుకోవచ్చు. అయితే, తక్కువ మందితో మాత్రమే నిర్వహించుకోవాలి. ఈ ఆంక్షలన్నీ మంగళవారం నుంచి తక్షణమే అమల్లోకి వస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో ఈ రోజు రాత్రి 8 గంటల నుంచే దేశవ్యాప్తంగా "స్మార్ట్ లాక్‌డౌన్" అమల్లోకి రానుంది.

# ఇకపై క్లారిటీగా వాట్సాప్ కాల్స్..

- **అందుబాటులోకి కొత్త ఫీచర్**

**త్రినేత్ర.న్యూస్:**

**ఇన్‌స్టంట్ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్‌లో త్వరలో అందుబాటులోకి రానున్న కొత్త ఫీచర్లపై ప్రకటన విడుదల చేసింది. వాటిల్లో నాయిస్ క్యాన్సిలేషన్ ఫీచర్ కూడా ఒకటి. అయితే ఈ ఫీచర్ ప్రస్తుతం వాట్సాప్ బీటా యూజర్లకు అందుబాటులోకి వచ్చింది. అందువల్ల త్వరలోనే పూర్తి స్థాయిలో సాధారణ యూజర్లందరికీ ఈ ఫీచర్‌ను అందుబాటులోకి తెస్తారని భావిస్తున్నారు. నాయిస్ క్యాన్సిలేషన్ ఫీచర్ వల్ల యూజర్లు వాట్సాప్‌లో వాయిస్ లేదా వీడియో కాల్స్ చేసే సమయంలో బ్యాక్ గ్రౌండ్‌లో వచ్చే అనవసర శబ్దాలను చాలా వరకు తగ్గించవచ్చు. ఫోన్‌లో డిఫాల్ట్‌గా నాయిస్ క్యాన్సిలేషన్ ఉంటుంది కానీ అది సాధారణ కాల్స్‌కు మాత్రమే పనిచేస్తుంది. అందువల్ల వాట్సాప్ ఈ ఫీచర్‌ను తన ప్లాట్‌ఫామ్‌లో ప్రవేశపెట్టనుంది.**



నాయిస్ క్యాన్సిలేషన్ ఫీచర్ వల్ల వాట్సాప్‌లో కాల్స్ చేసుకునే సమయంలో అనవసర శబ్దాలు తగ్గి కాల్ స్పష్టత పెరుగుతుంది. కాల్స్ క్వాలిటీగా ఉంటాయి. స్పీకర్ వాయిస్‌ను ఇది ప్రభావితం చేయదు. ఈ ఫీచర్ వల్ల ఎల్లప్పుడూ ప్రయాణాలు చేసేవారు, బయటనే ఎక్కువగా గడిపే వారికి ఎంతో ఉపయోగం ఉంటుంది. వాయిస్, వీడియో కాల్స్ కోసం నాయిస్ క్యాన్సిలేషన్ ఫీచర్‌ను ప్రస్తుతం బీటా యూజర్లకు ఆ సంస్థ దశలవారీగా అందిస్తోంది. ప్రస్తుతం వాట్సాప్‌కు చెందిన ఆండ్రాయిడ్ బీటా వెర్షన్ 2.26.14.1 ను ఉపయోగిస్తున్న యూజర్లకు ఈ ఫీచర్ అందుబాటులో ఉంది. ఈ ఫీచర్ సహాయంతో గాలి, ట్రాఫిక్ వంటి శబ్దాలను రియల్‌టైమ్‌లో ఫిల్టర్ చేయవచ్చు. అవతలి వ్యక్తికి వాయిస్ స్పష్టంగా వినిపించకపోయినా, మరేదైనా సాంకేతిక సమస్య ఏర్పడినా ఈ ఫీచర్‌ను ఆఫ్ చేసుకునే విధంగా కూడా వెసులు బాటు కల్పించారు. అతిత్వరలోనే ఈ ఫీచర్‌ను యూజర్లందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు వాట్సాప్ యత్నిస్తోంది.



## కేరళలోని ఆలయాలకు భూరి విరాళం

**త్రినేత్ర.న్యూస్:**

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో పర్యటిస్తున్నారు. అక్కడి ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి, ఏనుగుల సంక్షేమానికి భారీ విరాళం ప్రకటించారు. కేరళలోని ప్రముఖ ఆలయాలు రాజరాజేశ్వరం ఆలయం, గురువాయూర్ ఆలయాన్ని సందర్శించిన అనంత్ అంబానీ రెండు ఆలయాలకు చెరో రూ. 3 కోట్లు చొప్పున మొత్తం రూ. 6 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. అదనంగా, చారిత్రక ప్రాధాన్యత కలిగిన రాజరాజేశ్వరం ఆలయ తూర్పు గోపుర పునరుద్ధరణ పనుల కోసం రూ. 12 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

## స్టాక్ మార్కెట్స్

| | | |
|---|---|---|
| NIFTY | - | ▲ 23,123 |
| SENSEX | - | ▲ 74,616 |

**డాలర్ వర్సెస్ రూపాయి**

1 డాలర్ కు
**92.98** రూపాయలు

**బులియన్ మార్కెట్**

- 24 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) - రూ.1,49,840
- 22 క్యారెట్ల బంగారం ధర (10 గ్రాములు) - రూ.1,37,350
- వెండి ధర (ఒక కిలో) - రూ.2,55,000



# లవ్‌స్టోరీస్ నిజమనుకున్నా..



నయనతారతో ప్రేమాయణం, పెళ్లిపై ఆమె భర్త విఘ్నేష్ శివన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ మూవీ ప్రమోషన్స్‌లో కొన్ని విషయాలతో అభిమానులతో పంచుకున్నారు. ఆమె లవ్‌స్టోరీస్, రిలేషన్‌షిప్స్ నిజమేనని అనుకున్నా. నయన్ వ్యక్తిత్వాన్ని తప్పుగా అంచనా వేశా. ఆమెతో పరిచయం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే నా ఊహలు తప్పని అర్థమైంది. మనల్ని ద్వేషించేవారు నిజాలు చెప్పినా నమ్మరు. నానుమ్ రౌడీథాన్ షూటింగ్‌లోనే నయన్‌తో ప్రేమలో పడ్డా. కొద్ది రోజుల్లోనే ఒకరినొకరం బాగా అర్థం చేసుకున్నాం. నయన్ తన వాట్సాప్ డీపీగా మా ఇద్దరి ఫోటో పెట్టుకుంది. అప్పుడే ఫస్ట్ టైమ్ మా లవ్‌స్టోరీ లీక్ అయ్యింది. మాపై చాలా ట్రోల్స్ చేశారు. ఇప్పుడు మేమిద్దరం ఆ ట్రోల్స్ చూసి నవ్వుకుంటాం" అని విఘ్నేష్ శివన్ అన్నాడు.



# పెళ్లైంది.. పిల్లలను కూడా కన్నా...

త్రిష పెళ్లి చేసుకుందని, సినిమాలకు దూరమవుతుందంటూ వచ్చిన వార్తల వేళ ఈ చెన్నై క్వీన్ రియాక్ట్ అయ్యింది. ఇన్‌స్టాలో సెటైరికల్‌గా చేసిన ఓ పోస్ట్ ఇప్పుడు వైరలవుతోంది. తమిళ డైరెక్టర్ చిత్రా లక్ష్మణన్ తనపై చేసిన కామెంట్లకు గట్టి కౌంటర్ ఇచ్చింది. "నేను సినిమాలకు గుడ్‌బై చెప్పేశానట. రిచ్ బిజినెస్‌మెన్‌ను పెళ్లి చేసుకున్నానట. మాకు నలుగురు పిల్లలట. ఈరోజుకు ఈ కట్టుకథలు సరిపోతాయా.. ఇంకేమైనా జోడించాలా?" అంటూ వ్యంగ్యంగా ఓ పోస్ట్ పెట్టింది. తాను సినిమాలకు దూరం కావడం లేదని ఈ పోస్ట్ ద్వారా త్రిష సమాధానమిచ్చిందని నెటిజన్లు అంటున్నారు. కాగా తమిళంలో సూర్యతో కరుప్పు సినిమాలో త్రిష నటించింది. మే 14న ఈ మూవీ థియేటర్లలోకి రాబోతుంది.

# మృణాల్ ప్లేస్‌లో నిధి?

టాలీవుడ్‌లో మోస్ట్ అన్‌లక్కీ హీరోయిన్ ఎవరంటే మొదట వినిపించేది నిధి అగర్వాల్ పేరే. పవన్ కళ్యాణ్, ప్రభాస్ వంటి స్టార్ హీరోలతో సినిమాలు చేసిన అదృష్టం మాత్రం కలిసిరాలేదు. పరాజయాలతో సంబంధం లేకుండా నిధి టాలీవుడ్‌లో మరో బంపరాఫర్ అందుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. పెద్దిలో మృణాల్ ఐటెం సాంగ్ చేస్తున్నట్లు కొన్ని రోజులుగా రూమర్లు వినిపించాయి. అయితే ఆమె ఆఫర్‌ను రిజెక్ట్ చేసిందట. మృణాల్ నో చెప్పడంతో ఆమె స్థానంలో నిధి అగర్వాల్‌ను మేకర్స్ ఫైనల్ చేశారట. పాటలోనే కాకుండా కొన్ని సీన్స్‌లో కూడా ఈ రాజాసాబ్ బ్యూటీ కనిపించేలా కథలో మార్పులు చేసినట్లు సమాచారం. రామ్‌చరణ్, నిధి అగర్వాల్‌పై ఈ స్పెషల్ సాంగ్‌ను ఈనెల 9 నుంచి హైదరాబాద్‌లో షూట్ చేయబోతున్నట్లు సమాచారం.





# విరోష్ కొడవ విందు..

పెళ్లైన నెల రోజుల తర్వాత లవ్‌బర్డ్స్ విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న కొడవ సంప్రదాయ పద్ధతిలో రిసెప్షన్ వేడుకను జరుపుకున్నారు. నేషనల్ క్రష్ పుట్టి పెరిగిన విరాజ్‌పేటలో సోమవారం ఈ సెలబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ఇందుకు సంబంధించిన ఫొటోలు వైరల్ అవుతోన్నాయి. విజయ్, రశ్మిక కొడవ సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. ఒకరి చేతిని మరొకరు పట్టుకొని చిరునవ్వులు చిందిస్తూ విజయ్, రశ్మిక ఫంక్షన్ హాల్‌లోకి ఎంటరవుతున్న వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. సెరినిటీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకలో కుటుంబ సభ్యులతో పాటు అతి కొద్ది మంది సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారట. ఈనెల 5న రశ్మిక తన 30వ పుట్టినరోజును జరుపుకోగా ఆ తర్వాత రోజే ఈ వేడుకతో అభిమానులను సర్‌ప్రైజ్ చేశారు